కథా నిలయం
4776
శ్రీకాకుళం

# నేచెప్పానుగా!

అంతా మనలాగే ఉంటారా? మన మేదో మర్యాదగా మంచిగా మౌనంగా ఉంటాం. మన అభిప్రాయం అడిగితే చెప్తాం. అదీ చెప్పవలసివస్తేనే చెప్తాం. అందరూ ఇలా వుండరు. మామూలుగా ప్రవర్తించరు. అడిగినా, అడక్కపోయినా అభిప్రాయాలు వెలిబుచ్చుతారు; ప్రకటనలు చేస్తారు; ఉద్దేశాలు ఉద్ఘాటించుతారు. పిలవని పేరంటానికి వెళ్ళిపోతూ వుంటారు. అవసరంలేని విషయాలలో అర్జెంటుగా జోక్యం కలిగించుకుంటారు. వీళ్ళంతా ఉద్దండపిండాలు, మహామహులు, ప్రముఖవ్యక్తులు.

వీళ్ళలోకూడా రకాలవారీ మనుష్యు లున్నారు. పూరా గొప్పవాళ్ళు, సగంగొప్పవాళ్ళు, లోకం వప్పుకున్నా తమమీద తమకు నమ్మకం లేనివాళ్ళు, లోకం అంగీకరించకపోయినా తమమీద తమకి మాచెడ్డ నమ్మకమున్న వాళ్ళు వగైరా వగైరా ఎందరో మహానుభావులు ఈ గొప్పవాళ్ళు తమ గొప్పవైన నోళ్ళు తెరవగానే వాళ్ళు ఏరకం గొప్పవాళ్ళో మనం పోల్చుకోవచ్చు. వీళ్ళకి సూత్రప్రాయమైన ఊతపదాలు ఉంటాయి. తమ అమూల్యమైన అభిప్రాయప్రకటనలో మొదటో, మధ్యనో, కొసనో సదరు ఊతపదాలని వాడుతారు. ఆ ఊతపదాలు ఏమిటయ్యా అంటే- 'నన్నడిగితే, నా కెందుకులే, టైంలేదు, ఏదో ఫరవా

లేదు, నే చెప్పేనుగా' ఈ అయినన్నూ గొప్పవాళ్ళ ఊత పదాల పేర్లు.

ఈ ఊతపదాలనుబట్టి వాళ్ళు వాళ్ళ గొప్పతనం యొక్క పవ రెంతో అది ఎలాపోల్చుకోడమో చెప్తా. హోమియోపతి మాత్రలు చూడడానికి అన్నీ ఒకలాగే వుంటాయి. అలాగే ఈ మహానుభావులు కూడా తేడా పాడాలులేనట్టు కనబడతారు. సదరు హోమియోపతి మాత్రలలో ఎక్సులు తేడా ఉన్నట్టే ఈ ప్రముఖుల వాక్యాలలో కూడా బోలెడంత తేడా వుంది. నన్నడిగితే అనేవాళ్ళను తీసుకోండి. వీళ్ళు కొద్దిగా నాకెందుకులే అనేవాళ్ళలాగే కనబడతారు గాని నన్నడిగితే అనేవాళ్ళు తమ అభిప్రాయాలకు బాధ్యత వహించుతారు. నాకెందుకులే అనేవాళ్ళు తమ ఫలితానికీ, దానియొక్క మంచిచెడ్డలకీ బాధ్యత వహించరు. నన్నడిగితే అనేవాళ్ళు తమమనసులోని భావాలని బయటికి చెప్పేసి ఆతరువాత కనబడరు. కనబడ్డా మాట్లాడరు. మళ్ళీమాట్లాడినా నన్నడిగితే అనే ఇంకో సంగతి చెబుతారు. టైంలేదు అనేవాళ్ళు నిజంగా నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరిగేవాళ్ళు. వీళ్ళకి ఎప్పుడూ టైం ఉంటూనే ఉంటుంది. అదిలేదని బయటికి చెప్పడంలోనే ఆ టైమంతా వృధాచేస్తారు. అయినా వాళ్ళు గొప్పవాళ్ళే. ఇక ఫరవాలేదు అనేవాళ్ళు అందరికన్నా గొప్పవాళ్ళలాగ కనబడతారు. నారదుడొచ్చి పాడినా వీళ్ళకి ఓ మోస్తరుగానే వినబడుతుంది. ఫరవాలేదు పనికొస్తాడు అంటారు. రంభ నాట్యమాడినా, మయుడు అద్భుతవిచిత్రశాలలునిర్మిం

చినా ఫరవాలేదు అనేవాళ్ళకి ఓ మోస్తరుగానే వుంటాయి. వీళ్ళకి తృప్తిఅన్నది లేదు. పరపెక్షను అన్నది వీళ్ళ పరమావధిగా కనబడుతుంది గాని, అదికూడా వీళ్ళకి సరిపోదు. అందుచేత, నేను మనవిచేసిన ప్రముఖులలో అగ్రతాంబూలం వీరికే ఇవ్వాల్సి ఉంటుందేమో అనిపించవచ్చు. గానీ, అందరికన్నా గొప్పవాళ్ళు నే చెప్పానుగా అనేవాళ్ళు. వీళ్ళు ఒకరకంగా చూస్తే సన్నడిగితే సైంలేదు ఫరవాలేదు అనే మనస్తత్వాల కలగలుపు. వీళ్లు ఏ విషయానికైనా మొట్టమొదట కట్టకడ ప్రకటన బడుతూ ఉంటారు.

వీళ్లు రామాస్వస్తి రావణాస్వస్తిగాళ్ళు. ఏ యెండ కా గొడుగు పట్టేస్తారు. జాగిలాలతో వేటాడుతారు. కుందేళ్ళతో పరుగెడతారు. మందార మకరంద మాధుర్యముల దేలు మధుపమ్ము పోవునే మరోచోటుకి. అందుచేత వీళ్ళు ఎటు గెలుపుంటే అటే చేసుతారు. ఆసంగతి తమకు తొలి దగ్గరినుంచి తెలిసినట్టే నటిస్తారు. అది నటన అని తెలియనివ్వకపోవడంలోనే ఉంది వాళ్ళ ప్రాముఖ్యం.

ఇది జొత్తిగా మరీ కలికాలం. కాబట్టి నే చెప్పానుగా అనేవాళ్ళు ఊసరవిల్లిలాగ, పైరుకొట్టేవాళ్ళలాగ, పెద్ద మనుష్యులలాగ, చెడ్డవాళ్ళలాగ మనకు కనబడతారు గానీ, కృతయుగంనుంచీ ఇలాంటివాళ్ళు లేకపోలేదు. సత్యకాలపు రోజుల్లో సత్యకాలపు మనుషుల లోకూడా ఈ నేచెప్పానుగా అనేవాళ్ళు ఉన్నారు.

మాటవరసకి వశిష్టుణ్నే తీసుకోండి. ఈ గురుదేవుడు హరిశ్చంద్రుడు అష్టకష్టాలు పడ్డాక అంతిమవిజయం సాధిం

చాక చక్కా వచ్చి నేచెప్పానుగా హరిశ్చంద్రుడు అబద్ధం ఆడ్డు అని చెప్తాడు. నిజమే ఈయన ముందే చెప్పాడు. బాగానే వుంది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ప్రత్యక్షమైన ప్పుడే ఈయనా ప్రత్యక్షమై హరిశ్చంద్రుడుగారు అమాంతంగా అర్ధాంగలక్ష్మి తలకొట్టేసే సమయానికే, ఆఘట్టాన్ని నాటకంగా చూస్తున్న ఆడియన్సుల కన్నీళ్ళతో జేబురుమాళ్ళు తడిపేసిన వేళకే ఈయన సరిగ్గా దిగబడి ఏమయ్యా విశ్వామిత్రుడా, నేను చెప్పలేదూ అంటే ఎలా ఉంటుంది చెప్పండి. మాటామాటావచ్చి, వాళ్ళూ వాళ్ళూ పోటీలు పడి మధ్యనొకణ్ణి ఇలా బాధపెడతారూ? పెట్టేరు. మనమేం చేస్తాం? ఆనాటకం ఆడుతున్నప్పుడల్లా స్నేహితులతోపాటు చూడడానికి వెళ్తాం. చూస్తాం. చూస్తున్నంతసేపూ మన ప్రక్కనకూర్చున్న మిత్రరత్నం నే చెప్పలేదూ-ఈ ఘట్టంలో ఫలానా యాక్టరు ఫలానా రాగంలో పాడతాడనీ అంటూ మనచెవి కొరుకుతూంటే అదికూడా సహిస్తాం.

దేవతలలోనూ, దేవత్వం వున్నవాళ్లలోనే కాదు-రాక్షసులలోనూ నే చెప్పానుగా అనేవాళ్ళు పూర్వంనుంచీ వున్నారు. ఒరే మాయలేడి వేషం వేసుకొని రాముణ్ణి మర పింతాలు పెట్టరా అని రావణాసురుడు మారీచుడితో చెప్పాడు. ఒద్దురా స్వాములారి వేషంవేసుకొని రాముడి భార్యజోలికి పోకు అని మారీచుడు ఎంతో చెప్పాడు. రావణాసురుడు వినలేదు. చచ్చిపోయినవాళ్ళలోకంలో మారీచుడు రావణాసురుణ్ణి కలుసుకున్నాక నోరు తెరిచి చెప్పిన మొదటి మాటలు నే చెప్పానుగా అనేవే అయి ఉంటాయి.

వీళ్ళందరూ ఒక యెత్తు. శ్రీకృష్ణుడు ఒక యెత్తు.
అత డంత పాలిటీషియన్ ఇంకొకడు లేడు. అనవసరంగా నార
దుణ్ణి కలహప్రియు డంటారుగాని, ఆదినుంచీ ఆ శ్రీకృష్ణపర
మాత్ముడు వీళ్ళకీ వాళ్ళకీ ముడిపెట్టి ఆనందించేవాడు.
పై పెచ్చు చివర్న నే చెప్పానుగా అంటాడు. మాయముని
వేషంవేసుకొని అర్జునుణ్ణి కొండమీద ముక్కుమూసుకొని
కూర్చోమన్నవాడూ ఆయనే - బలరాముడు ఆమాయా
ముని సపర్యలకి సుభద్రని నియమిస్తున్నప్పుడు జాగర్త అన్న
య్యా ఏం మునుగుతుందో! అని వార్నింగ్ ఇచ్చినవాడూ
ఆయనే- సుభద్రనిచ్చి పెళ్ళిచేసి అర్జునుణ్ణే ఎత్తుకుపొమ్మని
చెప్పి చూశావా అన్నయ్యా, నేను ఆనాడే చెప్పానుగా
అన్నవాడూ ఆయనే - నే చెప్పానుగా అనే ప్రముఖులకి ఆది
పురుషుడు ఈ దివ్యపురుషుడే.

బలరాముడు కనబడ్డప్పుడల్లా శ్రీకృష్ణుడు నేచెప్పానుగా
అనేటట్టే మనకు కనబడుతుంది. పాండవులతరఫున కౌరవ
సభకి రాయబారం వెళ్ళాడు. అక్కడ చెప్పవలసినవన్నీ
చెప్పాడు. జెండాపై కపిరాజు మొదలైన పద్యాలు చదువు
తాడు. సంతోషంబున సంధిచేయ మంటాడు. కౌరవులు
వింటారా! కాళ్ళూ చేతులూ కట్టేయబోయి కయ్యానికి
కాలు దువ్వారు. యుద్ధమైంది. చచ్చిరి సోదరుల్ సుతుల్
చచ్చిరి. దుర్యోధనుడు మడుగులో దూరి జలస్తంభన
కానిచ్చాడు. ఎత్తిపొడుపులుపొడిచి రాజరాజుని బైటికిలాగు
తానని భీముడు ముందుకొచ్చాడు. అబ్బాయ్! నువ్వుకాదు
మీ అన్నయ్య ధర్మరాజు ఎత్తిపొడిస్తేనే బయటకొస్తాడని

చెప్పి కృష్ణుడు చతురంభోధిపరీతమైన ధరణీచక్రంబు శాసించి అనే పద్యాలు చదివేస్తాడు. దుర్యోధనుడు బయటి కొచ్చి గదాయుద్ధానికి తలపడ్డప్పుడు బలరాముడు వచ్చి తమ్ముడిని తిడతాడు:

సంధి గావింపకుండు నే చతురుపాయ
ముల నెఱింగిన బుద్ధికౌశలము గలవు
ఉత్తవైరంబు పెంచితి రిత్త నేల
ధరించి సుఖించు నే ధర్మరాజు!

అని బలరాముడనగానే, కృష్ణుడు నే ముందే చెప్పానుగా, అంటూ అన్నయ్యా నామీద లేని యపవాదు మోపిన నే నేమందును! అద్దమున్నది, మొగమున్నది, దుర్యోధనునే యడుగరాదా? అయిదూళ్ళిచ్చిన పాండవులకు జాలునని నే బతిమాలితినో లేదో అని చల్లగా చెప్తాడు.

అది ద్వాపరయుగం కాబట్టి, ఎంతచెడ్డా ధర్మం రెండు కాళ్ళమీదనైనా నడచేది కాబట్టి మొట్టమొదట ఫలానారకంగా జరుగుతుందని చెప్పి కట్టకడపట నే చెప్పానుగా అనేవారు అలా అనడం బాగానేఉంది. ఇప్పుడు ఘోరకలి ముండిపోతున్నది కాబట్టి ముందు ఏమీ సెలవియ్యకుండానే అన్నీ అమర్చినదాంట్లో అత్తగారు వేలుపెట్టినట్లు ప్రముఖులు ఆఖరుఘట్టంలో హాజరయి నే చెప్పానుగా అని తయారవుతారు.

మనుష్యు లెందు కిలా అంటూఉంటారన్న విషయం కొంచెం ఆలోచించవలసిందే. పర్యవసానంకోసం ఈషణ్మాత్రం పాటుపడకుండా, ఫలితం తేలిన వేళలో పక్షిలాగ

రెక్కలు కట్టుకొనివాలి, ఆ ఫలితమంతా తమ ప్రయోజకత్వమే అని భావుకొందామనుకోడంలోనే నే చెప్పానుగా అనే జబ్బుకి పునాది ఉంది. పరాన్నభుక్కుతనం పెరిగినకొద్దీ ఈ జబ్బు వింతవింత రూపాలు ధరించడానికి వీలుచిక్కింది. రాతిగొడ్డలి రాతిక చేసుకొనడంలోనూ, చేతులారా తిండి సంపాదించుకొనడం లోనూ సతమతమయ్యే ఆదిమానవుడు ఎప్పుడూ నేను చెప్పానుగా అని ఉండడు. చాతుర్వర్ణాలు ఏర్పడ్డాక కొందరికి తీరుబాటుదొరికాక పర్యవసానంనిమిత్తం పాటుపడకుండా ఫలితాలు జుర్రుకొనడం మొదలయిన దగ్గరనుంచి ఈ నేచెప్పానుగా అని గొప్పలు చెప్పుకొనడం ప్రారంభం అయిందని నా ఉద్దేశం.

పొలంనుంచి పంటవస్తే కాలుమీద కాలువేసుకుని కబుర్లు చెప్పే మహానుభావులు ఎంతకైనా తగినవాళ్ళే. రాంభజన మందిరం అవరణలోనో, రచ్చబండమీదో కూర్చుని వీళ్ళు మాట్లాడేటప్పుడు గంటసేపు సాగే సంభాషణలో కనీసం అరడజనుసార్లయినా నే చెప్పానుగా అనే మాట మనకి వినబడకతప్పదు.

గొప్పలుచెప్పుకొనడం మెప్పుసంపాదించడం మానవ నైజమే అనుకోండి. దమ్మిడీయెత్తు పనిచెయ్యకుండా పల్లెత్తు మాటసాయం చెయ్యకుండా మెప్పుకొట్టేద్దా మనుకునేవాళ్ళే ఇలా బయటపడిపోతూ ఉంటారు. నిజంగా చెప్పినవాడు బయటికి చెప్పనే చెప్పడు. అతడిదగ్గరకే చెప్పించుకొన్న వాడు వెళ్ళి బాబూ మీరు చెప్పారండీ గానీ అని మొదలెడ

తాడు. ఆచెప్పిన ఆయన మొహమాటపడి పోనిద్దూ అంటాడు. అలా అనడంచేత, ప్రచారం కోరుకొనకపోవడంవల్ల, అతను సాధారణవ్యక్తిగా ఉండిపోతాడు. స్వంత బాజా రెండుచేతులా వాయించుకొనేవాడు ఎండుతాటాకు మండు టాకు మంటలాగ నిముషంలో ప్రముఖుడైపోతాడు. మంట చల్లారినా మాటలు చెప్పడం మరచిపోలేడు. ఇవాళ గురువారం అని మీరన్నారనుకోండి. ఈ సంగతి నేను నిన్ననే చెప్పానుగా అని తడుముకోకుండా చెప్పేస్తాడు- ఈరోజు గురువారం కావడానికి తానే కారణంఅయినట్టు, మనల్ని భావించమంటాడు.

ఇలాంటివాళ్ళని చూశాక త్యాగరాజస్వామి పాడినట్టు ఎందరో మహానుభావులు అందరికీ వందనములు అని ఒక్క-దండం పెట్టాలనిపిస్తుంది, గాని, నన్నడిగితే, నాకు తెలుసు, ఫరవాలేదు, టైంలేదు, నేను చెప్పానుగా అనే ప్రముఖులందరూ కళ్ళముందు నిలబడగానే అందరూ మహానుభావులు ఎందరికని వందనాలు అని విసుగెత్తి మానేస్తాం.